

వినతులు స్వీకరిస్తున్న జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్

వినతుల స్వీకరణతోనే సరి..

- సమస్యలు పరిష్కారం కావడం లేదు..
- కుక్కలు, కోతుల బెడద నుంచి రక్షించాలి..
- బల్దియా ప్రజావాణిలో ప్రజల విన్నపాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 22 : వినతుల స్వీకరణతోనే సరిపెడుతున్నారని, సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ ప్రజలు జీడబ్ల్యూఎంసీ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి జరిగింది. ప్రజలు వివిధ సమస్యలపై వినతులు అందచేశారు. వినతుల స్వీకరణ మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తే న్యాయం జరుగుతుందని ప్రజలు విన్నవించారు. జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 57 వినతుల సమర్పణ జరిగింది. ప్రజావాణి వినతుల వివరాలు ఇలా.....

- వరంగల్‌లోని 17వ డివిజన్‌లోని స్తంభంపల్లి ఆదర్శనగర్‌కు చెందిన మామిశెట్టి సురేందర్ తాగునీరు సరఫరా కావడం లేదని ఫిర్యాదు చేశారు. అంతకు ముందు తమకు యధావిధిగా నల్లా వచ్చేదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసిన తరువాత గతంలో ఉన్న నల్లా నీరు కూడా రావడం లేదన్నారు. ఆస్తి, నల్లా పన్ను సక్రమంగా చెల్లిస్తున్నామన్నారు.
- వరంగల్ మక్కా మసీద్ ప్రాంతంలో డ్రెయినేజీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మసీద్ కమిటీ ప్రతినిధులు తెలిపారు.
- ఫోర్ట్ వరంగల్ ఈద్గాలో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించాలని పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతూ కమిటీ ప్రతినిధులు కోరారు.
- భీమారం ఎర్రగట్టుగుట్ట శ్రీనివాస కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రోడ్లపై మురికినీరు చేరుతోందని ఫిర్యాదు చేశారు. కాలనీలోని రోడ్ నెంబర్-1లో కల్వర్టు దెబ్బతినడంతో మురికినీరంతా రోడ్లపైకి చేరి దుర్గంధం వ్యాపిస్తుందని, సమస్యను పరిష్కరించాలని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడురాజయ్య, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్ విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీలోని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పన, విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ రెవెన్యూ కాలనీ-3 డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ఎస్ సాయిలు, ప్రధాన కార్యదర్శి జే దేవేందర్‌రావు కోరారు.
- హనుమకొండ భీమారం విద్యారణ్యపురి ఇంటి నెంబరు 2-12-14/1కు చెందిన డాక్టరు ఉప్పు శివనాగయ్య నల్లా పన్ను విషయమై ఫిర్యాదు చేశారు. తన ఇంటికి నల్లా లేనప్పటికీ పన్ను డిమాండ్ నోటీసు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు కాజీపేట సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు.
- హనుమకొండ గుండ్ల సింగారానికి చెందిన తిరుపతి కుక్కలు, కోతుల సమస్య నుంచి నగర ప్రజలకు విముక్తి కల్పించాలని కోరారు. ప్రతి డివిజన్‌లో కుక్కలు, కోతులు ప్రజలపై దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు.
- 64వ డివిజన్ మడికొండలోని శ్రీనగర్ కాలనీ, శ్రీసాయి కాలనీ ప్రజలు డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.
- 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు కబ్జాకు గురవుతోందని రమేశ్, శ్రీధర్, శరత్ తదితరులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే చెరువు కొంత భాగం కబ్జాకు గురైందని కబ్జారాయుళ్లు మరింతగా ఆక్రమించే చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే పరిరక్షణ చర్యలు చేపట్టాలని కోరా రు. కబ్జాకు గురైన చెరువు విషయంలో విచారణ జరిపించి స్వాధీనం చేసుకోవాలని, హద్దులు పెట్టాలని కోరారు. అదనపు కమిషనర్ రవీందర్ యాదవ్, ఎస్ఈలు క్రిష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీపీ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేశ్ పాల్గొన్నారు.



శ్రీగోవిందరాజుస్వామి దేవాలయం నుంచి మొదలైన శోభాయాత్ర

మార్మోగిన శ్రీరామ నామం

- ఊరూవాడ శ్రీరాముడికి పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు
- శోభాయాత్రలు, అన్నదానాలు, కల్యాణాలు
- బాలరాముడి ప్రాణప్రతిష్ఠను టీవీల్లో వీక్షించిన ప్రజలు
- పులకించిన భక్తజనం
- సాయంత్రం ఇళ్ల ముందు వెలిగిన దీపాలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ వేడుకలను తిలకించి జిల్లావాసులు తన్మయత్వం పొందారు. టీవీలు, ప్రధాన కూడళ్లు, ఆలయాల్లో ఏర్పాటు చేసిన పెద్ద తెరలపై అయోధ్య లైవ్ దృశ్యాలను తిలకించి పులకించిపోయారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నామం మార్మోగింది. ప్రతీ మది భక్తి పారవశ్యంతో ఉప్పొంగిపోయింది. ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వాడవాడల అన్నదానాలతో, ప్రసాదాల పంపిణీతో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వరంగల్ ఓసిటీ రోడ్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక అటవీ, దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరంగల్‌లోని రామన్నపేటలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. వ్యాపారులు స్వచ్ఛందంగా పలు చోట్ల అన్నదానాలు నిర్వహించారు. ఆలయాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద రాముడి చిత్రపటాలు ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించారు. ఈమేరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కరీమాబాద్‌లో హనుమంతుడి శోభాయాత్ర

ఆకట్టుకున్న శోభాయాత్రలు..

అయోధ్య రాముడి పేరు మీద ప్రతీ వీధిలో, ప్రతీ గ్రామంలో రాముడి చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి, భజనలు చేసి జై శ్రీరామ్ అంటూ శోభాయాత్రలు నిర్వహించారు. నగరంలోని ఎల్లంబజార్‌లో శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం, శివనగర్‌లోని రామాలయం పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించారు. శివనగర్‌లో వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి పారాయణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్నదానాలు, ప్రసాద వితరణలు జోరుగా సాగాయి. నగరంలో పలు చోట్ల పెద్ద ఎత్తున అన్నదాన వితరణలు జరిగాయి. బట్టల బజార్, స్టేషన్ రోడ్డు, చౌరస్తా, రామన్నపేట, పోతన రోడ్డు, హంటర్‌రోడ్డు, శివనగర్, గిర్మాజీపేట, మట్టెవాడ, కాశిబుగ్గ, ఓసిటీ, అన్ని ప్రాంతాల్లో కార్యక్రమా లు కొనసాగాయి.

ఇంటింటా దీపాల వేడుకలు..

శ్రీరామ జన్మభూమి ట్రస్టు, విశ్వహిందూ పరిషత్, సంగ్ పరివార్ సంస్థలు పిలుపు నిచ్చిన నేపథ్యంలో ప్రతీ ఇంటిపై జైశ్రీరామ్ జెండాలను ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకొని సాయంత్రం ఇళ్లల్లో ఐదు దీపాలు వెలిగించారు. రాముడికి హారతిచ్చి రాముడి అక్షింతలను శిరస్సుపై వేసుకొని దీపావళి పర్వదినాన్ని జరుపుకున్నారు.

అవినీతిరహితంగా అధికారులు పనిచేయాలి..

రాష్ట్రంలో ఫ్రెండ్లీ అధికారుల ప్రభుత్వం : ప్రజావాణిలో మంత్రి కొండా సురేఖ



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ కలెక్టరేట్, జనవరి 22: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అవినీతిరహితంగా అధికారులు పనిచేయాలని, రాష్ట్రంలో ఫ్రెండ్లీ అధికారుల ప్రభుత్వంలో కష్టపడి పనిచేసి ప్రజలకు సమస్యలు లేకుండా చూడాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం మంత్రి హోదాలో సురేఖ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో అధికారులను అభినందించారు. హైదరాబాద్‌లో ప్రజాభవన్‌లో వరంగల్ జిల్లాకు సంబంధించిన దరఖాస్తులు రెండు విడతల్లో వచ్చాయని, ఆ దరఖాస్తులను ఈ రోజున వచ్చిన 55 దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన దరఖాస్తులపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ప్రజలు అందించిన దరఖాస్తులపై ఇప్పటికే ప్రభుత్వ అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి అర్హులైన వారికి పథకాలు అమలు చేసేలా చూస్తామన్నారు. ఒక సమస్యపై దరఖాస్తుదారుడు పలుమార్లు ప్రజావాణికి రాకుండా పరిష్కారం అవ్వాలన్నారు.

రెవెన్యూ, భూ సంబంధిత సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించాలన్నారు. ఆరు గ్యారెంటీల ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేశారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో నిష్పక్షపాతంగా లబ్ధిదారుల సర్వే చేయాలన్నారు. గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రోడ్లు, డ్రెయినేజీలు పరిశుభ్రత పాటిస్తున్నాయని దీన్ని కొనసాగించాలని మంత్రి సూ చించారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో వరంగల్ సంబంధించిన రెండు విడతల్లో వచ్చిన 266 దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపుతూ ఆర్డీవోను నోడల్ అధికారిగా వేగవంతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే, కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు, జడ్పీ సీఈవో రాంరెడ్డి, వివిధ శాఖల అధికా రులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రికి కలెక్టర్ ప్రావీణ్య మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

- రాష్ట్ర భాషోపాధ్యాయులందరికీ న్యాయం జరగాలని కోరుతూ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సంఘం జిల్లా కార్యవర్గం మంత్రి కొండా సురేఖకు హనుమకొండలోని తన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టేబుల్ క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండా యాదగిరి, జిల్లా అధ్యక్షుడు కక్కెర్ల రమేష్, ప్రధాన కార్యదర్శి పోతుల మురళీధర్, హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణ చందర్ ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు

హనుమకొండ అర్బన్: కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగర పరిధిలోని 21వ డివిజన్ ఎల్‌బీనగర్‌లో ఆదివారం జరిగిన కుక్కల దాడిలో గాయపడిన అలీ అక్బర్ గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంత్రి కొండా సురేఖ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రభుత్వ పరంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నగరంలో కుక్కలు, కోతుల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కల్పించేలా చర్యలు : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 22: ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో గుర్తింపు, గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం ట్రాన్స్‌జెండర్స్ సమస్యలపై కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు ఐడీ కార్డులు, ఆధార్‌కార్డులో మార్పులు, రేషన్‌కార్డుల మంజూరిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో ట్రాన్స్‌జెండర్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని తొందరపడి దరఖాస్తులను రిజక్ట్ చేయవద్దని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జడ్పీసీఈవో, డీఆర్‌డీ అధికారులు పాల్గొన్నారు.



రేషన్ దందా!

- పేదల బియ్యం అక్రమ రవాణా
- పాలిష్ పెట్టి, సన్నబియ్యంగా మార్చి ఇతర రాష్ట్రాలకు సరఫరా
- అధికారులకు రూ.లక్షల్లో మామూళ్లు
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో విస్తరించిన వ్యాపారం
- ఓ సబ్ డివిజన్, మరో సర్కిల్ విభాగాల పోలీసులకు ముడుపులు

వరంగల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అక్రమ సంపాదనే ధ్యేయంగా కోటి విద్యలు ప్రదర్శిస్తూ, ఓ వ్యక్తి కోట్లు దండుకుంటున్నాడు. నెలనెలా అధికారులకు లక్షల్లో మామూళ్లు ఇచ్చి రేషన్ బియ్యం అక్రమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నాడు. ఇతర రాష్ట్రాలకు సైతం లారీల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపించడంలో పుష్ప సినిమాను తలదన్నేలా చెక్ పోస్టులు దాటిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ 'కోటి' విద్యల పెద్ద మనిషికి పోలీసులు, సివిల్ సప్లయి, ఆర్టీఏ, టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారుల అండదండలు ఉండడంతో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోందని సమాచారం. వరంగల్ జిల్లాలో కీలకమైన ప్రాంతాలే కేంద్రాలుగా రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. వ్యాపారులు, డీలర్లు లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి సమీపంలోని ప్రాంతాలకు గుట్టు చప్పుడు కాకుండా కొందరు ఖాకీలతో కలిసి దందా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రైస్ మిల్లర్లు రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్చి మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రూపాయి కిలో బియ్యాన్ని అక్రమంగా పక్కదారి పట్టించి ఎక్కువ మొత్తంలో లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ అక్రమ దందాకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొంతమంది అధికా రులు, పోలీసుల తెరవెనుక మద్దతు ఇస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. వరంగల్ రూరల్ నుంచి వరంగల్ జిల్లాగా ఏర్పడి నాటి నుంచి వరంగల్ - హనుమకొండ సరిహద్దు కేంద్రంగా బియ్యం మాఫియా విస్తరిస్తోంది. డీలర్లు, జనాల వద్ద నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్న ముఠా లారీల ద్వారా మహారాష్ట్రకు తరలించి లక్షలు గడి స్తోంది. ఈ ముఠా అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధి కారులు వారి నుంచి మామూళ్లు తీసుకుని ఏమి తెలియ నట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

రెండు జిల్లాల్లో అతనిదే హవా...

కొందరు అక్రమార్కులు రాత్రికి రాత్రే వరంగల్, హనుమకొండ జిల్లాలో రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు చేరవేస్తూ లక్షలు దండుకుంటున్నారు. ఓ వ్యక్తి తన సామ్రాజ్యాన్ని విస్తరించుకునేందుకు 12 మంది వ్యక్తులతో కలిసి ఓ ముఠాను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గ్రామాల్లోని రేషన్ డీలర్ల వద్ద ఒప్పందాలు కుదుర్చుని రేషన్ బియ్యాన్ని అక్కడి నుంచి ఓ చోట భద్రపరిచి లారీ లోడు అయ్యేలా చేస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం లారీలను రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బియ్యం చేరవేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. హనుమకొండ జిల్లా ములకనూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి, మొదటగా హసన్‌పర్తి, ములకనూరు, జనగామ జిల్లా రాజారం కేంద్రంగా బియ్యం అక్రమ వ్యాపారానికి తెరతీశాడని తెలుస్తోంది. తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులతో ప్రారంభించి విస్తరించుకున్నాడనే ప్రచారం సాగుతోంది. వరంగల్, హనుమకొండలోని కొందరు అధికారుల అండదండలతో పోలీసులు, సివిల్ సప్లయి, రెవెన్యూ, ఆర్టీఏ, విజిలెన్స్ అధికారులను మచ్చిక చేసుకుని అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఒక్కో విభాగానికి నెలకు రూ. 3 లక్షల నంచి రూ.4 లక్షల వరకు మామూళ్లు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వరంగల్ టూ మహారాష్ట్ర...

హసన్‌పర్తి కేంద్రంగా పాత ఇనుప సామాను పేరిట 12 మందితో ముఠా ఏర్పాటు చేసిన వ్యాపారి ఎలాంటి బెదురు లేకుండా రేషన్ బియ్యం దందా నడుపుతున్నట్లు సమాచారం. వరంగల్ నుంచి మహారాష్ట్రకు

మిగతా 8వ పేజీలో..

దందా సాగుతోందిలా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టవంతం చేసేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నా అక్రమ దందా ఆగడం లేదు. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో 509 రేషన్ షాపులున్నాయి. నర్సంపేట డివిజన్‌లో 217, వర్ధన్నపేటలో 135 పౌరసరఫరాల దుకాణాల ద్వారా రూపాయి కిలో బియాన్ని అందిస్తున్నారు. వరంగల్ నగరంలోని రేషన్ షాపుల లబ్ధిదారులతోపాటుగా పలు గ్రామాల్లో దళారులు ఇంటింటా కిలోకు రూ.7 నుంచి రూ.10కి కొనుగోలు చేసి కిలోకు రూ.15లకు కోళ్ల దాన కోసం ఫారాలకు, రాజస్థాన్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు సరఫరా చేసి లాభాలు పొందుతున్నారు. గతంలో రేషన్ దుకాణాల్లోకి వచ్చిన బియ్యంను దళారులు రైస్ మిల్లులకు సరఫరా చేసేవారు. బియ్యంను సేకరించిన మిల్లర్లు వాటిని రీసైక్లింగ్ చేసి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) తిరిగి సరఫరా చేసి లాభాలు గడించేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సొసైటీలు, ఐకేపీ కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంను మిల్లర్లకు కేటాయించి, లెక్క ప్రకారం మిల్లర్ల నుంచి బియ్యం కొనుగోళ్లు చేస్తోంది. దీంతో అదనంగా బియ్యం సరఫరా చేయలేని పరిస్థితి మిల్లర్లకు ఏర్పడింది. మిల్లర్లుసహితం బియ్యం కొనుగోలును తగ్గించారు.

ఐనవోలు ఆలయ మాజీ చైర్మన్ వడిచర్ల శ్రీనివాస్ ఆత్మహత్య



ఐనవోలు, జనవరి 22: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ మాజీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ, ప్రస్తు త నందనం సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్(55) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం... శ్రీనివాస్ కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఐనవోలు లేని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య అనురాధ, కుమారుడు కమలహాసన్, కుతురు శివాని ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. కాగా, లండన్‌లో ఉంటున్న కుమారుడు కమలహా సన్ మంగళవారం ఐనవోలు చేరుకుంటారని, అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

కాగా, పుట్టిన రోజు నాడే శ్రీనివాస్ ఆత్మహత్యకు పా ల్పడటాన్ని కుటుంబసభ్యు లు, శ్రేయోభిలాషులు జీర్ణించుకోలేకపోతున్నారు. శ్రీనివాస్ రాజకీయ నాయకుడిగా స్వయంకృషితో ఎది గారు. 2001లో టీడీపీ నుం చి ఐనవోలు ఎంపీటీసీగా గెలుపొందారు. 2006లో కాంగ్రెస్ పార్టీలోచేరి పూర్వ వర్ధన్నపేట మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 2012 -15 వరకు ఐనవోలు దేవస్థానం చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఐనవోలు మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. నందనం సొసైటీ డైరెక్టర్‌గా కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. గత ఏడాది మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుకు సన్నిహితుడిగా మెదిలారు. శ్రీనివాస్ మృతి విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మధుమతి, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల జిల్లా, మండల నాయకులు తరలివచ్చి భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

30 నుంచి ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జనవరి 30 నుంచి ఇంజనీరింగ్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6 ,8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తులిపారు. బీటెక్ (సీబీసీఎస్) మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ రెగ్యూలర్, సప్లిమెంటరీ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 22: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

జాతీయ స్వచ్ఛాగ్రహి అవార్డుకు ఎంపిక

జంగాలపల్లి సర్పంచ్ దంపతులకు ఢిల్లీ నుంచి ఆహ్వానం



అనిత-వినయ్‌కుమార్

ములుగు, జనవరి 22: ములుగు మండలం జంగాలపల్లి సర్పంచ్ మసర గాని అనిత, ఆమె భర్త వినయ్‌కుమార్‌కు అరుదైన అవకాశం దక్కనుంది. ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథులుగా పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులను విజయవంతంగా చేపట్టడం, ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో వంద శాతం చేపట్టడంతో స్వచ్ఛాగ్రహి అవార్డుకు ఎంపిక చేశారు. ఐదు వేల మంది జనాభా, 2,860 మంది ఓటర్లు, 1,150 ఇళ్లు కలిగిన జంగాలపల్లిలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, అన్ని వీధుల్లో అంతర్గత రోడ్లు, సైడ్‌డ్రెయినేజీల నిర్మాణం జరిగింది. ఇటీవల గ్రామాన్ని సందర్శించి స్వచ్ఛభారత్ కేంద్ర బృందం దీనిపై సంతృప్తి వ్యక్తం చేసింది. బృందం సభ్యులు ఇచ్చిననివేదిక ఆధారంగా సర్పంచ్ దంపతులకు పురస్కారం దక్కనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు గ్రామపంచాయతీలు, ఇద్దరు రాష్ట్ర కోఆర్డినేటర్లు ఈ అవార్డుకు ఎంపిక కాగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి జంగాలపల్లి పంచాయతీ ఒక్కటే ఉండటం విశేషం. ఈనెల 24 నుంచి 29 వరకు ఢిల్లీ పర్యటన కొనసాగనుండగా సర్పంచ్ అనితతో పాటు ఆమె భర్త వినయ్‌కుమార్ పాల్గొననున్నారు.

నేడు కేడీసీలో అతిథి

అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్, మైక్రో బయాలజీ సబ్జెక్టులో ఒక్కో పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు జనవరి 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ధృవపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు కళాశాలలో హాజరు కావాలని కోరారు.

నరికివేత సరే, తొలగింపేది..?

● విద్యుత్‌శాఖ - జీడబ్ల్యూఎంసీ మధ్య 'ట్రీ వార్' ● రోడ్ల పక్కనే రోజుల తరబడి చెట్ల కొమ్మలు

● తరలింపు మీదంటే మీదని ఇరు సంస్థల దాగుడుమూతలు ● సమన్వయ లోపంతో నగరవాసుల ఇబ్బందులు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 22: విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్న విద్యుత్‌శాఖ.. ఆ తర్వాత వాటి తొలగింపును మాత్రం విస్మరిస్తోంది. నరికిన చెట్ల తొలగింపు వ్యవహారం బల్దియా, విద్యుత్ శాఖ మధ్య వివాదంగా మారింది. ఈ బాధ్యత మీదంటే.. మీదే అంటూ రెండు శాఖలు ఒకరిని ఒకరు నిందించుకుంటున్నాయి. రెండు శాఖల తీరుతో నగరవాసులు మాత్రం చెట్ల కొమ్మల నరికివేతతో సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీడబ్ల్యూఎంసీ, విద్యుత్‌శాఖల మధ్య..

నరికిన చెట్ల కొమ్మలను ఎవరు తొలగించాలనే వ్యవహారం కొన్నేళ్లుగా పరిష్కారం కావడం లేదు. విద్యుత్ శాఖ, బల్దియాల మధ్య ఈ అంశం పెద్ద రగడగానే పరిణమించింది. ఇరుశాఖలు పరస్పరం సహకారం, సమన్వయంతో వ్యవహరించడం లేదు. దీంతో సమస్య తీవ్రమై రెండు శాఖల మధ్య వార్ జరుగుతోంది.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

విద్యుత్ శాఖ నరికిన చెట్ల కొమ్మలను తొలగించడం లేదు. ట్రీ కటింగ్ పేరుతో ఇష్టారాజ్యంగా చెట్ల కొమ్మలను నరికివేసి కాలనీల్లోని ఇళ్ల ముందే పడవేసి వెళ్తున్నారు. ఇదేమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తే కూడా చెట్ల కొమ్మలు నరికిన వారు దురుసుగా సమాధానం ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తరువాత తీస్తామని.. లేదంటే బల్దియా వారు తీస్తారంటూ సమాధానమిస్తున్నారు. మరోవైపు విద్యుత్ శాఖ వ్యవహారం బల్దియా తలనొప్పిగా మారింది.

బాధ్యత మరుస్తున్న విద్యుత్ శాఖ

వాస్తవానికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛభారత్ మార్గదర్శకాల మేరకు చెట్ల కొమ్మలు నరికిన తరువాత విద్యుత్ శాఖ మాత్రమే వాటిని తొలగించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో జీడబ్ల్యూఎంసీకి తొలగింపు చర్యల నిమిత్తం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, పన్ను మదింపు అంశాన్ని జీడబ్ల్యూఎంసీ ఉదహరిస్తోంది. ఇంటి నుంచి చెత్త సేకరణకు గాను ఆస్తిపన్నులో చెత్తపన్నును కలిపి వసూలు చేస్తున్న సంగతిని జీడబ్ల్యూఎంసీ ప్రస్తావిస్తోంది. ఇదేక్రమంలో విద్యుత్ శాఖ కూడా బల్దియా ద్వారా తొలగింపు జరగాలనుకుంటే ఈ మేరకు పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జీడబ్ల్యూఎంసీ స్పష్టం చేస్తోంది. అలాకాకుండా పన్ను విధించకపోవడం, సొంతంగా కొమ్మలను తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.15లక్షల చెల్లింపు నోటీసుల జారీ

చెట్ల తొలగింపు జరిపిన క్రమంలో ఈ మేరకు రూ.15లక్షల పన్ను మదింపు విద్యుత్ శాఖకు జరిగింది. ఇటీవలే ఈ డిమాండ్ నోటీసులను విద్యుత్ శాఖకు జీడబ్ల్యూఎంసీ అందచేసినట్లు తెలిసింది. దీనిపై విద్యుత్‌శాఖ స్పందించడం లేదని బల్దియా చెబుతోంది. నిబంధనల మేరకు చెట్ల కొమ్మలు నరికిన క్రమంలో ఆ చెత్త తొలగింపు బాధ్యత విద్యుత్‌శాఖదే.. లేనిపక్షంలో తొలగింపు చేపట్టిన బల్దియాకు పన్ను అయినా చెల్లించాల్సి ఉంది.

కానీ విద్యుత్ శాఖ తీరు మాత్రం నగరవాసులకు సమస్యను తెచ్చిపెడుతోంది. ఒక డివిజన్‌లో విద్యుత్ శాఖ తొలగించిన కొమ్మలను తీసుకెళ్లేందుకు రోజుకు పది ట్రాక్టర్ ట్రిప్పులు అవసరం అవుతుందని బల్దియా చెబుతోంది. డివిజన్‌కు ఒకే ట్రాక్టర్ కేటాయింపు వల్ల ఈ సమస్య మరీ తీవ్రం అవుతోంది. చెట్ల తొలగింపునకే ట్రిప్పులు సరిపోకపోవడంతో రోజు వారి తొలగించే చెత్త మరో సమస్య బల్దియాకు ఎదురవుతోంది. పెద్ద పెద్ద కొమ్మలను ఇష్టారాజ్యంగా కాలనీల్లో రోడ్లపై పడవేయడం, ఆకులు ఎండి ఆ చెత్త ఇళ్లలోకి రావడం, చెట్లకొమ్మలు రోడ్లపై ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రెండు శాఖ మధ్య సమన్వయం లోపం నగర వాసులకు శాపంగా పరిణమించింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు చర్చించుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



వడ్డెపల్లి టీచర్స్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పడి వున్న చెట్ల కొమ్మలు

నేటి నుంచి శ్రీలక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

గీసుగొండ, జనవరి 22: గీసుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగులు సాంబరెడ్డి, అర్చకులు అర్చకులు వేదాంత వెంకటనరసింహాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 23న గీసుగొండ గ్రామంలోని ఆలయం నుంచి గుట్టపైకి ఉత్సవమూర్తులు చేరుట, కల్యాణోత్సవం, 24న హోమబలిహరణం, 25న పూర్ణాహుతి, రాత్రి జాతర బండ్లు తిరుగుట, మొక్కులు సమర్పించుట, 26న కేశఖండన, పుష్పయాగం, 27న ఉత్సవమూర్తులు గ్రామాలయానికి పునఃప్రవేశం జరుగునని వారు వివరించారు.

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

శంభునిపేట, జనవరి 22 : శంభునిపేట దూపకుంట రోడ్‌లోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ తాళ్ల నీలిమాదేవి అన్నారు. సోమవారం గురుకులంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 5వ తరగతితో పాటు ఇంటర్‌లో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు మైనారిటీ, నాన్ మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6,7,8 తరగతుల్లో మైనారిటీలకు బ్యాక్‌లాక్ ఖాళీలను భర్తీ చేయటానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 77804 02391 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మహాజాతరలో సేవలకు అవకాశం ఇవ్వండి

దేవాదాయ శాఖకు సింగరేణి కార్మికుల వినతి

మేడారం, జనవరి 22 : మేడారం మహా జాతరలో ఉచితంగా స్కౌట్ సేవలు అందించడానికి తమకు అవకాశం ఇవ్వాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా కార్మికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వాహక అధికారి రాజేంద్రంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత జాతరలో జంపన్నవాగు పరిసరాల్లో భక్తులకు 90 మంది కార్మికులతో భక్తులకు ఉచిత సేవలు అందించామన్నారు. అవకాశం కల్పిస్తే ఈసారి మహాజాతరలో కూడా సేవలు అందిస్తామన్నారు.

బండారి సింగిడిలో కొమురవెల్లి

ఘనంగా పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు

నిప్పుల్లో చిందేసిన శివసత్తులు, పోతరాజులు, భక్తులు



అగ్నిగుండంలో చిందేస్తున్న శివసత్తులు, భక్తులు

చేర్యాల, జనవరి 22: కొమురవెల్లి మల్లిఖార్జునస్వామిని స్తుతిస్తూ శివసత్తులు, పోతరాజులు, భక్తులు కణకణమని రగిలే నిప్పుల్లో చిందులేసి మైమరచిపోయారు.. దేవుడు..మల్లన్న దేవుడు... అంటూ స్వామివారి నామస్మరణతో అశేష భక్త జనులు పులకించారు. దేవదేవుడి ఆవాహనంతో చేతిలో వీరకోలతో సిగమూగుతూ అగ్నిగుండాలు దాటి తన్మయత్వం చెందారు. భక్తిపారవశ్యంలో కొముర వెల్లి ఓలలాడింది. కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభంలో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని హైదరాబాదుకు చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆలయతోటబావి ప్రాంగణంలో మల్లన్నకు అత్యంత వైభవోపేతంగా పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహించారు.

యాదవపూజారులు పసుపు, కుంకుమ, పచ్చ, బియ్యంపిండి, సునేరు, పంచ రంగులతో పెద్దపట్నాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. వంటచెరుకుతో అగ్నిగుండాలను తయారుచేశారు.పెద్దపట్నానికి చిత్రకన్ను అమర్చి గుమ్మడి కాయలను అష్టదిక్పాలకు లకు అలంకరించారు. మల్లన్న చరిత్ర, మహిమలను వివరిస్తూ యాదవపూజారులు ఒగ్గుకథను ఆలపించగా భక్తులు జయజయధ్వానాలు చేయడంతో ఆలయపరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తిప్రపత్తులతో వేస్తున్న పట్నాన్ని తిలకిస్తూ అశేష భక్తజనం పులకించిపోయారు. భక్తులు మల్లన్నను స్మరిస్తూ బండారిని వంటినిండా ధరించడంతో ఆలయ పరి సరాలన్నీ పసుపుమయంగా మారింది. పట్నం వేయడం, అగ్నిగుండాలను తయారు చేయడం పూర్తికాగానే గర్భాలయంనుంచి అర్చకులు మహదేవునిమల్లికార్జున్ తదితరులు ఉత్సవవిగ్ర హాలను పోలీసు బందోబస్తు నడుమ తీసుకు వచ్చి పట్నంచుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాదవులు గుమ్మడికాయలను బలిహరణ చేయగానే అర్చకులు అగ్నిగుండాలను దాటడం ప్రారంభించారు. అనంతరం మల్లన్నను స్మరిస్తూ అగ్నిగుండాలను దాటి స్వామివారిని దర్శించుకు న్న శివసత్తులు, భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో బాలాజీశర్మ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు కనుములు(ఆచారం) అందించి సత్కరించారు. పలువురు భక్తులు బెల్లంపానకం, నీళ్లప్యాకెట్లను, మరికొందరు అన్నదానం వితరణ చేశారు. బండారిని పంపిణీ చేశారు.

మేడారంలో ప్లాస్టిక్ నిషేధంపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డీపీవో వెంకయ్య

మేడారం, జనవరి 22 : మేడారం మహాజాతరలో ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు అవగాహన చేసేందుకు ములుగు డీపీవో వెంకయ్య సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మొబలైజర్లు ఇందులో పాల్గొనగా ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ మేడారం మహాజాతరకు సుమారు కోటిన్నర మంది భక్తులు మేడారం తరలివచ్చి విడిది చేస్తారని అన్నారు. వారు వదిలిన వ్యర్థాలతోపాటు ప్లాస్టిక్ అధికంగా ఉంటుందని తెలిపారు. ప్లాస్టిక్ ఫ్రీ మహాజాతరను నిర్వహించుకునేందుకు మొబలైజర్లు కృషి చేయాలన్నారు. భక్తులకు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలను చూపడానికి స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు ఐటీడీఏ ఏటూరునాగారం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జ్యూట్ బ్యాగుల వినియోగంపై భక్తులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో రహీం, పెసా కమిటీ జిల్లా అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామపంచాయతీల మొబలైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులపై వీధికుక్కల దాడి

ఇద్దరు విద్యార్థులకు గాయాలు



శునకాల దాడిలో గాయపడిన విద్యార్థులు

సుబేదారి, జనవరి 22 : నగరంలో వీధి కుక్కల దాడులు నిత్య కృత్యమవుతున్నాయి. రెండు రోజులు దాటకముందే మళ్లీ కుక్కలు విజృంభించాయి. ఆదివారం వరంగల్ 21వ డివిజన్ లోని ఎల్‌బీ నగర్‌లో అలీ అక్బర్, అనాస్ అనే ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి చేసి గాయపరిచిన ఘటన తెలిసిందే. అలాగే గత వారం రోజుల క్రితం న్యూశాయంపేట జంక్షన్ నుంచి పద్మాక్షి టెంపుల్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కాలనీలో ముగ్గురు వ్యక్తులను గాయపరిచాయి. ఈ రెండు ఘటనలు మరువక ముందే తాజాగా సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వెల్దండి కాలనీకి చెందిన వి. శ్రీహిత, ఎన్. దేవిప్రసాద్‌లు ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. కాగా, సోమవారం ఇద్దరు ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా శునకాలు మీద పడి దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన విద్యార్థులకు టీటీ ఇంజక్షన్లు ఇప్పించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 22: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రం, చిల్డ్రన్స్ పార్కు ఏరియా, మునిసిపల్ కమిషనర్ క్యాంపు ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జిసాంబరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా క్రిష్టా కాలనీ, స్టేషన్‌రోడ్, వరంగల్ చౌరస్తా, రామ్‌కీ, గ్రేన్ మార్కెట్, దయానంద్ కాలనీ, లక్ష్మీపురం, శివనగర్, ఏఎస్ రెడ్డినగర్, రంగశాయిపేట, మహంకాళి గుడి ఏరియా, హంస బేకరీ, గొల్లవాడ, కుమ్మరివాడ, నాయుడు పంపు, గణపతి ఇంజనీరింగ్ కాలేజీ, పెరుకవాడ చమన్, ఎస్ఆర్ఆర్ తోట, బీరన్నకుంట, మామునూర్ టౌన్, కుమ్మరిపల్లి, గవర్నమెంట్ డైరీ ఫామ్, పీవీఎన్ఆర్ వెటర్నరీ కాలేజీ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా రామన్నపేట, బట్టల బజార్, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్, ఓఎస్.నగర్, పాపయ్యపేట చమన్, దేశాయిపేట, బాలాజీనగర్, ఎంహెచ్ నగర్, నజరేత్‌పుర, కొత్తవాడ, డాక్టర్స్‌కాలనీ, బ్యాంక్ కాలనీ, మత్రివెంకటయ్య కాలనీ, రామ్‌నాథ్‌పురి, ఫిల్టర్‌బెడ్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేశి మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల ప్రవేశానికి నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 22 : గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులకు ఈ నెల 23వ తేదీ చివరి అవకాశమని వరంగల్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎస్.విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు గణిత టాలెంట్ టెస్ట్


హనుమకొండ రూరల్, జనవరి 22: ఈ నెల 24న గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించాలని గణిత ఫోరం బాధ్యులు జిల్లా అధ్యక్షుడు తౌటం భాస్కర్, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ, జిల్లా, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు తెలుగు మీడియం నుంచి, మరో ముగ్గురు ఇంగ్లీష్ మీడియం నుంచి అనుమతించాలన్నారు. 24న ఉదయం టెస్ట్ నిర్వహించి వెంటనే ఫలితాలు ప్రకటించాలన్నారు. ప్రతి మండలం నుంచి గెలుపొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ నెల 27వ తేదీన రీజినల్ సైన్స్ సెంటర్‌లో జరిగే టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులను పంపాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

26న చేపట్టే కిసాన్ ర్యాలీలో పాల్గొనండి

గిర్మాజిపేట, జనవరి 22 : ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఈనెల 26న చేపట్టిన కిసాన్ వాహన ర్యాలీలో రైతులు పాల్గొనాలని మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని ఓంకార్ భవన్‌లో చిర్ర సూరి అధ్యక్షతన జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ కార్మిక సంఘాల బాధ్యుల సమావేశంలో రమేష్ కేంద్ర రైతు వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కనీస మద్దతు ధర, రుణ విముక్తి చట్టాల కోసం దేశ వ్యాప్తంగా రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చాగా ఏర్పడి ఉద్యమాలు చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 26న రిపబ్లిక్ డే రోజున దేశ వ్యాప్తంగా 500 జిల్లాల్లో కిసాన్ వాహన ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఫిబ్రవరి 10న గ్రామీణ బంద్ పాటిస్తున్నట్లు చెప్పారు. 26న వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి జరిగే కిసాన్ వాహన ర్యాలీలో వరంగల్ జిల్లా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పి.రమేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు, కార్మిక, ప్రజాసంఘాల బాధ్యులు గోనే కుమారస్వామి, రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య కుసుంబ బాబురావు, భూక్య సమ్మయ్య,ఓదెల రాజన్న, ఈర్లపైడి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు పాదయాత్ర

నెక్కొండ నుంచి పాదయాత్ర చేపట్టిన సర్దార్‌సింగ్



పాదయాత్రతో బయలుదేరిన సర్దార్‌సింగ్

నెక్కొండ, జనవరి 22 : దేశంలో రామరాజ్యం రావాలని, హిందువులందరూ సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరుతూ నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన రైతు జరుపుల సర్దార్‌సింగ్ సోమవారం నెక్కొండ నుంచి అయోధ్యకు పాదయాత్రను చేపట్టారు. ప్రతీ హిందువు నిత్యం జైశ్రీరాం అన్నప్పుడే తన పాదయాత్ర సఫలీకృతమౌతుందన్నారు. రామ భక్తుడైన తాను శ్రీరాముడి ఆజ్ఞమేరకే తాను ఈ పాదయాత్ర చేపట్టానన్నారు. నెక్కొండ నుంచి అయోధ్యకు 1300 కిలో మీటర్లు ఉంటుందని ప్రతీ రోజు 60 నుంచి 70 కిలోమీటర్లు నడుస్తానన్నారు. ఈ పాదయాత్రను సర్దార్‌సింగ్ చెప్పులు లేకుండా చేస్తున్నారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రామభక్తులు సర్దార్‌సింగ్ యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఘనంగా సన్మానించారు.

రామాలయంలో ముస్లింల పూజలు



చెన్నారావుపేటలోని శ్రీరామ ఆలయంలో పూజలు చేసిన ముస్లింలు

చెన్నారావుపేట, జనవరి 22 : అయోధ్యలో శ్రీ బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరాముని ఆలయంలో ఓ ముస్లిం కుటుంబం ప్రత్యేక పూజలను చేసింది. గ్రామానికి చెందిన మహమ్మద్ సుబాన్, నసీమా బేగం దంపతులు కుటుంబంతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాముని విగ్రహ ప్రతిష్ఠాపన రోజున మతాలకు అతీతంగా రామునికి పూజలు చేయటంపై ఆ కుటుంబాన్ని పలువురు అభినందించారు.



ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి

సంగెం,జనవరి22: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతి పత్రం సోమవారం అందించారు. రైతు నాయకులతో కలిసి ర్యాలీగా తహసీల్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందించిన అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 45 రోజు అయినప్పటికి ఇచ్చిన హామీలను నేరవేర్చక కాలయాపన చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో రవి, సాంబయ్య, శ్రీనివాస్, దూడయ్య, రామారావు, అశోక్, చేరాలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు



గవిచర్ల పూజలో పాల్గొన్న హైకోర్టు మాజీ జడ్జి



శివనగర్ రామాలయంలో అయోధ్య లైవ్ చూస్తూ..



వరంగల్ చౌరస్తాలో రామ జ్యోతిని వెలిగిస్తున్న కార్పొరేటర్ గందె కల్పన



కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వరాలయంలో క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



శివనగర్‌లో పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

అంతా రామమయం

● నగరంలో మార్మోగిన శ్రీరామనామం

● అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ వేళ ప్రత్యేక పూజలు

కరీమాబాద్, జనవరి 22: కరీమాబాద్ ప్రాంతంలోని రామాలయాల్లో సోమవారం శ్రీరామ నామస్మరణ మారుమోగింది. ఆయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నగరంలోని రామాలయాల్లో పండగ వాతావరణం నెలకొంది. కరీమాబాద్‌లోని గుండుబావులు ప్రాంతంలో రామాలయంలో అయోధ్య కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని స్క్రీన్ ద్వారా తిలకిస్తూ భజనలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, డివిజన్ అధ్యక్షుడు మాచర్ల రవీందర్, సిద్ధం నరేష్, బోరగిం నర్సింగం, నాగరాజు, పాల్గొన్నారు. అలాగే, కరీమాబాద్ రామస్వామి దేవాలయంలో హనుమాన్ విగ్రహంతో శోభాయాత్రను నిర్వహించారు. రామస్వామి దేవాలయం నుంచి సుభాష్‌విగ్రహం ప్రాంతం వరకు కొనసాగింది. కార్యక్రమంలో గోగికార్ అనిల్, నరేష్, నాగరాజు, కిషోర్, రంజిత్ పాల్గొన్నారు.

●సంగెం: గవిచర్లలోని శ్రీసీతారాముల, ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. శ్రీరాముడికి హైకోర్టు మాజీ జడ్జి లింగాల నర్సింహరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ దొనికెల రమశ్రీనివాస్, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, గుండ బ్రహ్మయ్య ఆలయ కమిటీ చైర్మన్ కొంతం యాదగిరి, బీజేపీ మండల అధ్యక్షుడు కుమారస్వామియాదవ్ పాల్గొన్నారు.

● గిర్మాజీపేట: శ్రీగోవిందరాజస్వామి దేవాలయ అర్చకులు నిర్వహించిన శ్రీరాముడి శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. దేవాలయం మెట్ల మార్గం వద్ద శ్రీరాముడి శోభాయాత్రను ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి ప్రారంభించారు. మహిళలు మంగళహారతులతో జై శ్రీరామ్.. జైజై జానకీరామ్ నినాదాలు యాత్రలో మర్మోగాయి. శోభాయాత్ర వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డు, వరంగల్ హెడ్‌పోస్టాఫీసు, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, శ్రీదుర్గేశ్వరాలయం వీధి, పిన్నావారి వీధి, ఎల్లమ్మ బజార్, చార్‌బౌళి రోడ్డు మీదుగా తిరిగి శ్రీగోవిందరాజస్వామి దేవాలయం వద్దకు చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు లక్ష్మణ స్వామి, పవన్‌కుమార్ స్వామి, క్రాంతికుమార్ స్వామి, దాతలు మరిపెల్లి సంజీవరావు, ఆకుల అమరేందర్, స్థానికులు పాల్గొన్నారు. శ్రీగోవిందరాజస్వామి దేవాలయం సమీపంలోని కైలాసవారి వీధిలో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీసీతారామచంద్ర స్వామి భజన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు చింతాకుల సునీల్ కుమార్, కైలాసపు రాజన్న, నాగరామచందర్, లక్ష్మణ్, రాజేష్, ధరణిసాయి భక్త బృందం పాల్గొంది.

● శంభునిపేట: రామాలయంలో ఆలయ అర్చకులు శ్రీధరాచార్యులు, నరసింహామూర్తి, భార్గవ శర్మల చేతుల మీదుగా అయోధ్యలో చేసిన విధంగా యాగం క్రతువులు నిర్వహించారు. భక్తుల కోసం భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి అయోధ్య నుంచి ప్రత్యక్ష ప్రసారం చేశారు. కొట్లూరి రిషినంద్ ట్రస్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మిట్టపల్లి కపిల్, మండల మొగిలి, పెంచాల సురేందర్, కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, కేడల పద్మజనార్దన్, కొల్లూరి యోగానంద్, మంతెన సునీత తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాశీవిశ్వేశ్వర ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బొలుగొడ్డు సారయ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వనాథకాలనీలోని అభయాంజనేయ ఆలయంలో పూజారి గంగు సతీష్ శర్మ, చైర్మన్ కర్నె రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూపకుంట రోడ్‌లోని కార్యసిద్ధ హనుమాన్ సమేత సీతారామాలయంలో హనుమాన్ సేవాసమితి, శంభునిపేట పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవులపల్లి దయాకర్, శ్రీనాథ్, కందికొండ మోహన్, మురళీకృష్ణ, శ్రీదర్, రవిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ సిటీ: కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న కరుణశ్రీ నేతృత్వంలో రామ్‌చరణ్ అనే విద్యార్థుల బృందం అయోధ్య రామాలయాన్ని పోలిన థర్మకోల్ రామాలయాన్ని రూపొందించారు. 69 స్తంభాలతో ఏర్పాటు చేసిన రామాలయం అయోధ్య రామాలయాన్ని పోలి ఉండటంతో విద్యార్థులు దర్శించుకున్నారు. కరీమాబాద్‌లోని కివి పబ్లిక్ పాఠశాల యాజమాన్యం దాసి సతీష్ నేతృత్వంలో విద్యార్థులు చేపట్టిన అయోధ్య రామాలయం రంగోళితో పాటు శ్రీసీతారాముల ముగ్గులు ఆకట్టుకున్నాయి.

● వరంగల్‌టౌన్: కాశిబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వర శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుపురి సురేష్, కోశాధికారి సుల్తాన సమ్మక్క, పాల్గొన్నారు. అలాగే, కాశిబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వరాలయం లో 54లీటర్ల పాలతో సహస్ర లింగానికి క్షీరాభిషేకం చేశారు. శ్రీరామ నామం రాయబడిన 108 బిల్వ పత్రాలతో సహస్ర లింగానికి ప్ర త్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ బయ్యస్వామి, ప్రధాన కార్యదర్శి గోనె జగదీశ్వర్ పాల్గొన్నారు. కాశిబుగ్గ మిత్రమండలి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, ఓని స్వర్ణలత భాస్కర్, నాయకులు బాంబుల కుమార్,భూక్య మోతీలాల్ నాయక్, గోరంట్ల మనోహర్, గోగికార్ కిరణ్, ఓం ప్రకాష్ కోలారియా, సముద్రాల పరమేశ్వర్, వేముల నాగరాజు, వంగరి రాంప్రసాద్ పాల్గొన్నారు. అలాగే, ఎన్‌టీఆర్‌నగర్‌లో యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏనుమాముల సీఐ.మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● గీసుగొండ: కొనాయిమాకుల వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి(రామమందిరం) ఆలయంలో ప్రత్యేక భక్తి పారాయణాలను నిర్వహించారు.

● ఖిలావరంగల్: ఖిలావరంగల్ పడమరకోటలోని హనుమాన్, తూర్పుకోటలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో, ఖమ్మంరోడ్ రోడ్ వద్ద దేవేందర్ ఆధ్వర్యంలో, లేబర్‌కాలనీలోని పంచముఖనాగవీరేశ్వరాలయంలో అర్చకుడు శివశ్రీ భోగేశ్వరశాస్త్రీ ఆధ్వర్యంలో, శివనగర్‌లోని రామాలయంలో, అండర్‌బ్రిడ్జి వద్ద రాజేష్ ఉపాధ్యాయ్ ఆధ్వర్యంలో మెట్లబావి వద్ద, పూజలు చేసి అన్నదానాలు నిర్వహించారు. ప్రధాన సెంటర్ల అయోధ్య లైన్‌ను వీక్షించేందుకు స్కీన్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వరంగల్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా, బీజేపీ రాష్ట్ర నాయకుడు కుసుమ సతీష్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ పాల్గొన్నారు.

● మట్టెవాడ: ఆయోధ్యలో శ్రీ రామ విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని సోమవారం రాత్రి వరంగల్ చౌరస్తాలో కోటి ఒత్తులతో రామజ్యోతిని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ వెలిగించారు. వరంగల్ చౌరస్తాలో గందె నవీన్, ఫ్రెండ్ యూత్ అసోసియేషన్ తాటికొండ రాము ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, ఆర్ఎన్‌టీ రోడ్డులో రాముని విగ్రహాలను ఊరేగింపుగా నిర్వహించారు.

దేవాలయాలను అభివృద్ధి చేస్తాం: మంత్రి సురేఖ

వరంగల్‌టౌన్, జనవరి 22: దేవాలయాలను అభివృద్ధి చేస్తామని దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఓసిటీ రోడ్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయానికి సంబంధించి కల్యాణమండపం నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, నాయకులు నల్గొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ ఓని బాస్కర్, భూక్యా మోతీలాల్ నాయక్, కూచన ఏకాంబ్రం, శ్రీరంగం క్రిష్ణ, డాక్టర్ భాస్కర్, గుజ్జేటి రాజు, పూర్ణేందర్‌రెడ్డి, పుష్ప, లక్ష్మీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు యెలిశాల ఆనంద్, ప్రధాన కార్యదర్శి దాసరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'డీడీలు కట్టిన గొల్లకురుమలను ఇబ్బంది పెట్టొద్దు'

కరీమాబాద్, జనవరి 22: రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు కట్టిన గొల్ల కురుమలను గొర్రెలను పంపిణీ చేయకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా కన్వీనర్, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం తెలంగాణ గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఉర్సు కురుమవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రవి మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీ కోసం గొల్ల, కురుమల నుంచి డీడీలు కట్టించిందని, గొర్రెలు పంపిణీ చేసే క్రమంలో ఎన్నికలు రావడంతో కార్యక్రమం ఆగిపోయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డి రవి, సారయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దర్గా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తాం..

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మంత్రికి వినతి పత్రాన్ని అందిస్తున్న దర్గా పీఠాధిపతులు

కరీమాబాద్, జనవరి 22: ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు నిర్వహించే 468వ ఉర్సు మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున ముమ్మర ఏర్పాట్లు చేసి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరిస్తామని పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సోమవారం దర్గా పరిసర ప్రాంతాలను మంత్రి సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఉత్సవాల ఏర్పాట్లు విషయమై దర్గా పీఠాధిపతులు ఉబేద్‌బాబా, నవీద్‌బాబాలు మంత్రికి వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున దర్గా ఉత్సవాలకు ఏర్పాట్ల కోసం గ్రేటర్ కమిషనర్‌తోపాటు సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సరఫరా, రోడ్లు, పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. దర్గా పరిసరాల్లో లాంగ్ స్టాండింగ్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీ నియోజకవర్గానికి రూ.10కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారని, వీటితో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేయనున్నట్లు తెలిపారు.

●సీనియర్ రిపోర్టర్‌కు మంత్రి సురేఖ పరామర్శ

గీసుగొండ: మండల సీనియర్ రిపోర్టర్ కోల కృష్ణమూర్తి ఇటీవల ప్రమాదవశాత్తు చేయి విరిగి వరంగల్ గార్డియన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు మంత్రి కొండా సురేఖ సోమవారం కృష్ణమూర్తిని పరామర్శించారు. కార్యక్రమంలో గార్డియన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పగడాల కాళీప్రసాద్, నాయకులు రడం భరత్ తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

వరంగల్ సిటీ, జనవరి 22: క్రీడలు విద్యార్థుల్లో మానసికోల్లాసంతో పాటు శరీరదారుఢ్యాన్ని పెంపొందిస్తుందని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ, జిల్లా యువజన క్రీడల ఆధ్వర్యంలో ఓసిటీలోని గ్రౌండ్‌లో సోమవారం పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అశ్విని మాట్లాడుతూ క్రీడలు దూరమవుతున్న ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇలా క్రీడలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ఎం.శారద, క్రీడల శాఖాధికారి సత్యవాణి, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, సీడీపీవో విశ్వజ, ఉమెన్ హబ్ కో ఆర్డినేటర్ పావని, ఎస్‌జీఎఫ్ఐ సెక్రెటరీ బి. వెంకన్న, పెటా ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాపు పురస్కార్ అవార్డు అందుకున్న చందన

ఖిలావరంగల్, జనవరి 22: సెల్ఫ్ తాట్ పోర్ట్ రేట్ ఆర్టిస్ట్ కుసుమ చందన బాపు పురస్కార్ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభ కళానిలయంలో సాంస్కృతిక సంఘం సేవ సంస్థ ఆధ్వర్యంలో బాపు 90వ, జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీలలో చందన అవార్డును సాధించారు. చందనకు జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును ప్రఖ్యాత నటుడు, తనికెళ్ల భరణి చేతులమీదుగా మెమెంటో, అవార్డును అందుకుంది.



తనికెళ్ళ భరణి నుంచి అవార్డు పొందుతున్న చందన

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

సంగెం, జనవరి 22: మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల ఫోరం చైర్మన్ తిరుమల్‌రావు చెప్పారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో మాట్లాడుతూ వినియోగదారుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కాపులకనపర్తి సబ్‌డివిజన్ పరిధిలో ప్రధానమైన సమస్యలపై సంస్థ నిర్ణయం తీసుకోనే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫైనాన్స్‌మెంబరు చేరందాస్, ఇండిపెండెట్ సభ్యుడు నరేందర్, డీఈ తిరుపతి, ఏడీఈ నర్సింహరావు, సంగెం, కాపులకనపర్తి ఏఈలు మధుసూదన్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కాగా, కాంగ్రెస్ నాయకులు తిరుమల్‌రావుకు వినతి పత్రం అందించారు. ప్రధానంగా రైతులకు నిరంతరం విద్యుత్‌ను అందించి మండల కేంద్రంలో ఏడి కార్యాలయంను వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో మడంల పార్టీ అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ జనగాం రమేష్, చింతలపల్లి సర్పంచ్ ఇండ్ల రవికుమార్, మండల యూత్ అధ్యక్షుడు ఆగపాటి రాజుగౌడ్, కిసాన్‌సెల్ మండల శాఖ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

సంగెం, జనవరి 22: మండలంలోని పలు గిరిజన తండాల్లో సంగెం ఎస్సై భరత్ నేతృత్వంలో గుడుంబా స్థావరాలపై సోమవారం అధికారులు దాడులు చేశారు. చిలుకమ్మ తండాలో అక్రమంగా తయారు చేస్తున్న గుడుంబాను పోలీసులు, వర్ధన్నపేట ఎక్సైజ్‌శాఖ అధికారులు సంయుక్తంగా చేసిన దాడుల్లో భూమిలో పాతి పెట్టిన ప్లాస్టిక్ డ్రమ్ములను వెలికితీసి నిల్వ ఉంచిన గుడుంబాతోపాటు బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అలాగే నర్సనగర్‌లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది దాడులు నిర్వహించి, గుగులోతు కవిత, పాల్యా స్వరూప, గుగులోతు భద్రమ్మలపై కేసులు నమోదు చేశారు.



దాడుల్లో బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఇసుక తోడుతున్న జేసీబీ సీజ్

వర్ధన్నపేట రూరల్, జనవరి 22 : మండలంలోని ల్యాబర్తిలోని ఆకేరు వాగులో అక్రమంగా ఇసుకను తోడుతున్న జేసీబీని సీజన్ చేసిన సంఘటన సోమ వారం చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనంప్రకారం ల్యాబర్తి గ్రామంలోని ఆకేరు వాగు శివారు లో ఇసుకను ఎలాంటి అను మతులు లేకుండా తవ్వుతున్న సమాచారం మేరకు దాడులు చేయ గా జేసీబీ పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు బొల్లం రాజేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్పష్టంచేశారు.

సినిమాకి క్లాప్ కొట్టిన కొండా మురళీధర్‌రావు



సినిమాకు క్లాప్ కొట్టి ప్రారంభిస్తున్న కొండా మురళీధర్‌రావు

వరంగల్‌టౌన్, జనవరి 22: సినఫ్లిక్స్ కంపెనీ నిర్మాణ సారథ్యంలో, శ్యామల గణేష్ సమర్పణలో కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ పార్థు సైన దర్శకత్వంలో రూపొందుతున్న ప్రొడక్షన్ నం.1 సినిమాకు సోమవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు హీరో, హీరోయిన్‌పై క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. సమాజానికి మంచి సందేశం ఇచ్చేలా, అందరి మనసు దోచుకునేలా సినిమా ఉండాలని కొండా ఆశించారు. సినిమా మంచి వసూళ్లు రాబట్టి నిర్మాతకు లాభాలు చేకూర్చాలన్నారు. దర్శకుడు సైన మాట్లాడుతూ 1940వ దశకంలో భూస్వాములకు, దళితులకు మధ్య సాగే ఇతివృత్తంతో సినిమా రూపొందుతుందన్నారు. తన దర్శకత్వంలో గతంలో తీసిన మేక సూరికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రధాన తారాగణం శ్రీకాంత్ లేంజర్, అర్పిత్ చౌదరి, ప్రియాంక ప్రజాపతి, దేవయాని, సంగీతం ఫ్రాంక్‌లిన్ సుకుమార్, ఎడిటింగ్ ఎడ్వర్డ్, కెమెరామెన్ గోవర్ధన్ పాల్గొన్నారు.

షిరిడీలో కమ్మ సేవా భవన్ ప్రారంభం



షిరిడీలో కమ్మసేవా భవన్ ప్రారంభంలో వరంగల్ నాయకులు

గిర్మాజీపేట, జనవరి 22: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ షిరిడీ సాయిబాబా సన్నిధానంలో ఉభయ తెలుగు రాష్ట్రాల కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కమ్మ సేవా భవన్‌ను సోమవారం కమ్మ సంఘం నాయకులు, కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకులు జెట్టి కుసుమ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సాయిబాబాను దర్శించుకునేందుకు సాయిబాబా గుడి సమీపంలో భక్తుల వసతి కోసం కమ్మ సేవా భవన్‌ను నిర్మించినట్లు చెప్పారు. జిల్లా కమ్మ సంఘం కోశాధికారి ధనేకుల రాంబాబు మాట్లాడుతూ సాయిబాబాను దర్శించుకునే భక్తుల వసతికోసం నిర్మించిన కమ్మ భవన్‌లో ఎసీ గదికి రు.1400/, నాన్ ఎసీ గదికి రు.1000/ లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కమ్మ సేవా భవన్, షిర్డీ ఫోన్ నెంబర్లు 8432993999/8432995999లలో సంప్రదించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కమ్మ సేవా సంఘం నాయకులు రాయపాటి వెంకటేశ్వర్‌రావు, బండ్ల రవీంద్రబాబు, వాసిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సంగెం, జనవరి 22: మహిళలకు ప్రభుత్వం కలిపిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి అన్నారు. సోమవారం కుంటపల్లిలో మహిళ భవనంను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం కిషన్, మాజీ రైతుబంధు అధ్యక్షుడు నరహరి, సీఎలు పాల్గొన్నారు.

రేషన్ దందా!

5వ పేజీ తరువాయి

రోజుకు రెండుమూడు లారీల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు వరంగల్, హనుమకొండ, కాజీపేట సమీప గ్రామాలకు చెందిన రేషన్ బియ్యం సేకరిస్తున్నట్లు సమాచారం. ఆయా గ్రామాల్లో దొరికే రేషన్ బియ్యం మొత్తం తనకే విక్రయించాలని సదరు డాన్ కొనుగోలు దారులకు హుకుం జారీ చేసినట్టు తెలుస్తోంది. తన మాట వినని వారిని పోలీసుల సాయంతో దారికి తెచ్చుకుంటున్నాడనే విమర్శలున్నాయి. దీంతో ఎందుకొచ్చిన గొడవలే అని కొనుగోలు దారులు గ్రామాలు తిరిగి సేకరిస్తున్న బియ్యం అతడికే విక్రయిస్తున్నట్లు సమాచారం. వివిధ వర్గాల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్న ఈ మాఫియాకు ఎవరికి అనుమానం రాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన లారీల ద్వారా బియ్యం రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

● అధికారులకు భారీ మామూళ్లు..

ఒక్కో విభాగానికి నెలకు లక్షల్లో మామూళ్లు ఇస్తుండడంతో అధికారులు సదరు వ్యక్తి వాహనాలకు బార్లా గేట్లు తెరుస్తూ సహకరిస్తున్నట్లు సమాచారం సాగుతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఓ సబ్ డివిజనల్ స్థాయి అధికారికి నెలకు రూ.2 లక్షలకు పైగా, అలాగే వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ఉన్న ఓ సర్కిల్ స్థాయి అధికారికి నెలకు రూ.లక్ష వరకు మామూళ్లు ముట్టజెప్పుతున్నట్లు తెలుస్తోంది. మిగతా విభాగాల అధికారులకు సైతం వారి వారి స్థాయిలో ముట్టచెప్పి లారీలను ఇతర రాష్ట్రాలకు సాగనంపుతున్నాడని తెలుస్తోంది.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 23 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న నిర్మలాదేవి

ఖానాపురం, జనవరి 22 : ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు సఖి కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖికేంద్రం కౌన్సిలర్ నిర్మలాదేవి అన్నారు. సోమవారం అశోక్‌నగర్, ఖానాపురంలో సఖి సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి కేంద్రం సేవలు, మహిళా రక్షణ చట్టాలైన నిర్భయ చట్టం, గృహహింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధిత చట్టం, సైబర్ వేధింపులు, వాటికి గల పరిష్కారాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా హెల్ప్ లైన్ 181, 0870-3571832కి కాల్ చేసినచో ఆపదలో ఉన్న మహిళలకు వెంటనే సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో సీసీ అరుణ, వీవోఏలు హంసారాణి, నీరజ, సునీత తదితరులు పాల్గొన్నారు.

తాగు నీరు, పారిశుధ్య సమస్యలను

తక్షణమే పరిష్కరించాలి

• మునిసిపల్ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, జనవరి 22 : నర్సంపేట పట్టణం ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను, పారిశుధ్య సమస్యను తక్షణమే పరిష్కరించాలని మునిసిపల్ అధికారులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం మునిసిపల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని వెంటనే తాగు నీటి సమస్యను పరిష్కరించాలని, పట్టణంలో పారిశుధ్య నిర్మూళన పనులను సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకొని పారిశుధ్య నిర్మూళన పనులను పకడ్బందీగా చేపట్టేలా చూడాలని, లేనిపక్షంలో అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మిషన్ భగీరథ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.2 కోట్లతో నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనంలో కూరగాయల అమ్మకాలు జరిగేలా ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను ఆయన ప్రశ్నించారు. మిషన్ భగీరథ పనులతో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని, పారిశుధ్య పనులను పూర్తిస్థాయిలో నిర్వహించడంలేదని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి నెల చివరి వరకు మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి పట్టణ ప్రజలకు ప్రతి రోజూ తాగు నీటిని అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. డీప్లొరైడ్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాజెక్టు ద్వారా పట్టణ ప్రజలకు తాగు నీటిని అందించే విధంగా ప్రణాళికలను రూపొందించి తనకు అందించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, గ్రీన్‌ల్యాండ్ స్థలాలు, వెంచర్ల సమాచారం తనకు అందించాలని ఆయన సూచించారు. అధికారుల కొరతను నివారించాలని, మునిసిపాలిటీలోని అన్ని విభాగాలకు అధికారులను నియమించాలని, అందుకు సంబంధించిన వివరాలను అందించాలని కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కమీషనర్ నాయిని వెంకటస్వామి, ఇంజనీరింగ్ అధికారులతో పాటు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, కౌన్సిలర్లు బత్తిని రాజేందర్, ఎలకంటి విజయ్ కుమార్, పెండెం లక్ష్మి, ఓర్సు అంజలి, డీఈ రవీంద్రనాథ్, ఆర్ శేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ రజని, టిపిఓ వీరస్వామిగౌడ్, ఏఈ శాంతిస్వరూప్‌గౌడ్, సానిటర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ ముందంజ : సీఐ హతీరాం

నెక్కొండ, జనవరి 22 : కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఏఐటీయూసీ ముందుంటుందని నెక్కొండ సీఐ హతీరాం అన్నారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఏఐటీయూసీ నూతన డైరీని ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు.కార్మికులకు అండగా నిలుస్తున్న సంఘాలకు కార్మికుల్లోశాశ్వత గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ ఎస్సై షేక్ జాన్ పాషా, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, మండల పెయింటర్ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు ఈదునూరి అనిల్, షైదం రాజు, నాయకులు షైదం యాకయ్య, దబ్బేట వీరయ్య, కందిక రాజు, వెంకన్న, శ్రీలత, రమ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నామంతో మార్మోగిన ఆలయాలు



నర్సంపేటలో రామాలయం వరకు విగ్రహాలను ఊరేగిస్తున్న రామభక్తులు



వర్ధన్నపేట సీతారామచంద్రస్వామి దేవాలయంలో స్ర్కీన్‌పై అయోధ్యలో బాలరామ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ వీక్షిస్తున్న భక్తులు



రాగంపేటలో హోమపూజలో పాల్గొన్న భక్తులు

నర్సంపేట, జనవరి 22 : అయోధ్యలో బాలరామ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం నర్సంపేట పట్టణంలోని దేవాలయాల్లో అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అభిషేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని సంజీవని అనాథాశ్రమం నుంచి సీతారాములు, లక్ష్మణుడి విగ్రహాలను చేతబూని, అలంకరించిన వాహనంపై సీతారాములు, లక్ష్మణుడు, హనుమ విగ్రహాలను ప్రతిష్ఠించి రామాలయం వరకు ఊరేగింపును నిర్వహించారు. అనంతరం రామాలయం ఆవరణలో విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. శివాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు ఐనవోలు కృష్ణ మూర్తి శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులచే పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ద్వారకపేటలోని వేణుగోపాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు వెంకటాచార్యులు, శ్రీధరచార్యులు వేద మంత్రోచ్చారణల నడుమ భక్తులు, ఆలయ కమిటీ సభ్యులచే ప్రత్యేక పూజలుచేశారు. ఆలయాలలో రాములోరి పాటలు, భజనలతో మార్మోగాయి. జై శ్రీరాం, జైశ్రీరాం అంటూ భక్తులు చేసిన శ్రీరామనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్ర్కీన్స్‌పై అయోధ్య రామాలయ ప్రారంభం, బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు తిలకించారు. అనంతరం అన్ని ఆలయాల ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాంజనేయ ఆలయంలో ఆయల కమిటీ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, ఎంవీ రామారావు, ఎర్ర జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మణ్ బాబు, బండి రమేశ్, పంచమర్తి రామారావుతో పాటు కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. వేంకటేశ్వరాలయంలో ఆలయ కమిటి చైర్మన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రామానుజాచార్యులు వేదమం త్రోచ్చారణల నడుమ భక్తులచే పూజలు చేయించారు. రామాలయంలో జరిగిన పూజా కార్యక్రమం లో, సీతారాములు, లక్ష్మణ విగ్రహాల ఊరేగింపులో రామభక్తులు బాల్నె జగన్, గూడూరు సందీప్, అశోక్, వేంపల్లి శ్రీనివాస్, ఆకోతు రాజుయాదవ్, భక్తులు, మహిళలు పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప దేవాలయం ఆవరణలోని ఆంజనేయస్వామి దేవాలయంలో అయ్యప్ప ఆలయ చారిబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో శ్రీరాముడు, ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాలతో అభిషేక పూజలను నిర్వహించారు.పట్టణంలోని ముత్యాలమ్మ దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు చిలువేరు కుమారస్వామి, చిలువేరు వెంకటేశ్వర్లు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అన్ని ఆలయాల్లో పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు నెత్తిపై అయోధ్య రామయ్య అంక్షింతలను వేసుకున్నారు.

• వర్ధన్నపేట : బాలరామ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ, ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సందర్భంగా సోమవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో శ్రీరాముని శోభాయాత్రను నిర్వహించడంతోపాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ హాజరై ఆలయంలో ఏర్పాటు చేసిన పెద్ద స్ర్కీన్‌పై అయోధ్య బాలరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను ప్రత్యేక్ష ప్రసారాల ద్వారా భక్తులతో కలిసి వీక్షించారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్రీసీతరామచంద్రస్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి యువత సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు కలకోట రామాచార్యులు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కొండేటి సత్యం, బోంపెల్లి దేవేందర్‌రావు, సిలువేరు కుమారస్వామి, పెద్దూరి రాజ్‌కుమార్, మల్లెపాక అనిల్, తేజానాయక్ పాల్గొన్నారు.

• ఖానాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖానాపురం, అశోక్‌నగర్, రంగాపురం, ధర్మరావుపేట రామాలయాల్లో, మంగళవారిపేట,బుధరావుపేట, మనుబోతులగడ్డ, కొత్తూరు, రంగాపురం, రాగంపేట గ్రామాలతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో సీతారామచంద్రస్వామి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను వీక్షించేందుకు ఆలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో అర్చకులు పర్వతపు శివప్రసాద్‌శాస్త్రీ, హరీష్‌శర్మ, వేణుస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్‌లు శాఖమూరి చిరంజీవిహరిబాబు, కాస ప్రవీణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్, శ్రీరామాంజనేయ ఆలయాల్లో శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. మండల కేంద్రంలోని శ్రీరామాంనేయ ఆలయంలో అర్చకుడు సాయిశాస్త్రి వేదమంత్రోచ్చారణల మధ్య హోమ పూజలను నిర్వహించారు. యువనేత కంది కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహాఅన్నదానం నిర్వహించారు. సీతారాముల ఊరేగింపు కోసం భూషబోయిన రాజేష్ దాత పల్లకిని అందించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపును నిర్వహించారు. ఉప్పరపల్లిలో జిల్లా పరిషత్ పాఠశాలలో అయోధ్య రామయ్య అక్షింతలు, ప్రసాదం పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వనపర్తి మల్లయ్య, తోట రాము, గట్ల రాంబాబు, కాసుల వీరాచారి, హంస విజయరామరాజు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న వివిధ ఆల యాలతో పాటు శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆల యాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తరలివచ్చి స్వామివారి సేవలో తరించారు. ఇల్లంద గ్రామ శివారులోని శ్రీరాజరాజేశ్వస్వామి ఆలయం నుంచి వర్ధన్నపేట వరకు శ్రీరామ భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

• రాయపర్తి: మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీరామనామం మార్మోగింది. సోమవారం అయోధ్యలోని రామమందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, గ్రామస్థులు మొక్కులు చెల్లించారు. ప్రతీ రామాలయాల్లో, హనుమాన్ ఆలయాల్లో రాముల వారికి ప్రత్యేక నైవేద్యాలు పెట్టి కీర్తనలు ఆలపించారు.

• నెక్కొండ : మండలంలోని వివిధ గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీసీతా రామలక్ష్మణ అంజనేయస్వాములకు అభిషేకాలు ఘనంగా చేశారు. అనంతరం శ్రీసీతారాములకు శాంతి కల్యాణాలను జరిపించారు. దేశంలో శాంతియుత వాతవరణం నెలకొనాలని భక్తులు కోరుకుంటూ శ్రీరామహోమం జరిపి, గోవులను పూజించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నెక్కొండలోని శ్రీరామలింగేశ్వరస్వామి, పంచముఖాఅంజనేయస్వామి, అంజనేయస్వామి, అలంకానిపేట, పెద్దకొర్పోలు గ్రామాల్లోని శ్రీసీతారామస్వామి దేవాలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొనడంతో పండుగ వాతావరణం ఏర్పడింది.

• దుగ్గొండి : మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వెంకటాపురం గ్రామంలో హోమ పూజలు చేసి, మహా అన్నదానం నిర్వహించారు. రామాలయం దగ్గర నిర్వహించిన హోమం, శోభాయాత్ర, ప్రసాద వితరణలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వెలుపల గ్రామానికి చెందిన ఎండీ జమాలొద్దీన్ దంపతులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ ఊరటి మహిపాల్‌రెడ్డి, దాతలు నూనె శ్రీధర్, కక్కెర్ల సాంబయ్యగౌడ్, శానబోయిన రాజ్‌కుమార్, ఏడాకుల ఉమామహేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ విజయమోహన్‌రావు, మల్లికార్జున్‌గౌడ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీసీతారాముల దేవాలయంలో శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ సంచాలన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోనే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్త మార్కండేయ, సట్ల శ్రీనివాస్, పాండవుల రాంబాబు, గంగిశెట్టి నాగభూషన్, గోనెల నరహరి, అఖిల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దందా!

(5వ పేజీ తరువాయి)

రోజుకు రెండుమూడు లారీల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు వరంగల్, హనుమకొండ, కాజీపేట సమీప గ్రామాలకు చెందిన రేషన్ బియ్యం సేకరిస్తున్నట్లు సమాచారం. ఆయా గ్రామాల్లో దొరికే రేషన్ బియ్యం మొత్తం తనకే విక్రయించాలని సదరు డాన్ కొనుగోలు దారులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. తన మాట వినని వారిని పోలీసుల సాయంతో దారికి తెచ్చుకుంటున్నాడనే విమర్శలున్నాయి. దీంతో ఎందుకొచ్చిన గొడవలే అని కొనుగోలు దారులు గ్రామాలు తిరిగి సేకరిస్తున్న బియ్యం అతడికే విక్రయిస్తున్నట్లు సమాచారం.వివిధ వర్గాల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్న ఈ మాఫియాకు ఎవరికి అనుమానం రాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన లారీల ద్వారా బియ్యం రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

• **అధికారులకు భారీ మామూళ్లు..**

ఒక్కో విభాగానికి నెలకు లక్షల్లో మామూళ్లు ఇస్తుండడంతో అధికారులు సదరు వ్యక్తి వాహనాలకు బార్లా గేట్లు తెరుస్తూ సహకరిస్తున్నట్లు సమాచారం సాగుతోంది. వరంగల్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని ఓ సబ్ డివిజనల్ స్థాయి అధికారికి నెలకు రూ.2 లక్షలకు పైగా, అలాగే వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ఉన్న ఓ సర్కిల్ స్థాయి అధికారికి నెలకు రూ. లక్ష వరకు మామూళ్లు ముట్టజెప్పుతున్నట్లు తెలుస్తోంది. మిగతా విభాగాల అధికారులకు సైతం వారి వారి స్థాయిలో ముట్టచెప్పి లారీలను ఇతర రాష్ట్రాలకు సాగనంపుతున్నాడని తెలుస్తోంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పర్వతగిరి, జనవరి 22 : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అర్షం ఆనందం కుటుంబానికి సోమవారం టుగెదర్ నెస్ గ్రూప్ యూత్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో పేద కుటుంబాలకు చేయూతగా ఉండాలనే ఆలోచనతో యవత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థికసాయం అందించిన వారిలో బొట్ల సుధాకర్, రాజు, శ్రీను, మధు, యాకూబ్, అనిల్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దుగ్గొండి, జనవరి 22: మండలంలోని గిర్నిబావి శివారులోని తాటి వనంలో సోమవారం గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మోకు దెబ్బ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ గౌడ్ మాట్లాడుతూ గౌడ సహకార సంఘం బలోపేతం కోసం కేంద్ర ప్రభుత్వం ఇతర సహకార సంఘాలతో సమానంగా అభివృద్ధి చేయడానికి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. గీత కార్మి కులు గీత వృత్తిపై జీవనం సాగిస్తున్నారని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి మూడు సొసైటీల లాగ గౌడ సొసైటీని చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గొడిశాల సదానందం, వేముల వెంకటేశ్వర్లు, రంగు వెంకటేశ్వర్లు, గోపగాని వెంకట్,నాగపూరి మధు, మహేందర్, మొగిలి, నవీన్, శివ, నర్సయ్య కిరణ్, కర్నాకర్, పవన్‌లు పాల్గొన్నారు.

• రాయపర్తి : మండల కేంద్రంలో గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో 2024 సంవ త్సర క్యాలెండర్‌ను సోమవారం రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్, వెటర్నరీ డాక్టర్ శృతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, మండల అధ్యక్షుడు చందు మల్లేష్, గౌరవ అధ్యక్షుడు బందుల బాలరాజు, గాజు యాకయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, రాజు, సతీష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గండ్ర జ్యోతి తిరుపతి పాదయాత్రకు బ్రేక్


• చెన్నారావుపేటలో కాళ్లకు బొబ్బలు రావడంతో నిర్ణయం



చెన్నారావుపేటకు పాదయాత్రగా వస్తున్న గండ్ర జ్యోతి

చెన్నారావుపేట, జనవరి 22 : భూపాలపల్లిలో వేంకటేశ్వర స్వామి ఆలయం పూర్తికావటంతో కాలినడక తిరుపతికి వెళ్తున్న వరంగల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చేపట్టిన పాదయాత్ర సోమవారం మండలం కేంద్రం మీదుగా ఉదయం కొనసాగింది. మండల కేంద్రానికి ఉదయం 9 గంటలకు చేరుకోగానే బీఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మండలంలో 7కిలో మీటర్లు నడవగానే గండ్ర జ్యోతి అరికాళ్లకు బొబ్బలు రావటంతో మండల పరిషత్ కార్యాలయం వరకు చేరుకొని తిరుమల పాదయాత్రను నిలిపివేశారు. కాళ్ల నొప్పులు తగ్గిన అనంతరం పాదయాత్రను కొనసాగిస్తామని తెలిపారు. అయోధ్య శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఏపీవో కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి, ఎంపీపీ బాదావత్ విజేందర్, నల్లబెల్లి జడ్పీటీసీ, బీఆర్ఎస్ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, ఎంపీడీవో భారతి, ఏపీవో శ్రీనువాస్‌లతోపాటు పలువురు శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేశారు. భజన కీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి,జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, కందకట్ల సాంబయ్య సర్పంచ్ అనుముల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హామీలను తక్షణమే అమలు చేయాలి



డీటీ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట టౌన్, జనవరి 22 : రాష్ట్రంలోని పేదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఎంసీపీఐ(యూ), ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎంసీపీఐ(యూ)రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, ఏఐకేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశెట్టి సదానందం మాట్లాడుతూ రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, కౌలు రైతుల గుర్తింపు, వరి ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్, పేదల ఇండ్లకు స్థలాలు, కూలీ కుటుంబాలకు రూ.12వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 45 రోజులు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రక్రియ చేపట్టకపోవడం సరైంది కాదన్నారు. హామీల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో రమేష్, సాంబయ్య, బాబు, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

• పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ రైతుల పంట రుణాలను రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. రైతు భరోసా కింద రూ.15 వేలు రైతుల ఖాతాలో జమచేయాలన్నారు. వరి పంటకు బోనస్‌గా రూ.500 తక్షణమే అమలు పరచాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి వారికి బీమా, పంట రుణాల సౌకర్యం కల్పించాలన్నారు. ధరణిలో ఉన్న లోపాలను సవరించి సాగుదారులను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్క అశోక్, చేరాలు, సాంబయ్య పాల్గొన్నారు.

మాతృ మరణాలను తగ్గించేందుకు కృషి చేయాలి



ఏఎన్ఎంలకు అమ్మ కోసం యాప్‌పై ఇస్తున్న శిక్షణ

నర్సంపేట టౌన్, జనవరి 22 : మాతృ, శిశు మరణాల రేటును తగ్గించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రకాశ్ అన్నారు. నర్సంపేట మండల పరిషత్ సమావేశ హాల్‌లో పీహెచ్‌సీలకు చెందిన ఏఎన్ఎంలకు లర్నింగ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ అమ్మ కోసం యాప్ ఆర్షన్ స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారిచే సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ముందుస్తుగా గర్భిణీ స్త్రీలలో ప్రమాదకర లక్షణాలను గుర్తించి తగిన చికిత్స, సలహాలు అందించడం ద్వారా మాతృ మరణాల రేటును, శిశు మరణాల రేటును తగ్గించవచ్చన్నారు. అలాగే మాతా శిశు సంరక్షణ సేవలో తెలంగాణ రాష్ట్రం 3వ స్థానంలో ఉందని, అన్ని జాతీయ కార్యక్రమాల అమలులో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోషిణి, డాక్టర్ ఆచార్య, డాక్టర్ విజయ్, మనోజ, హెల్త్ ఎడ్యుకేటర్ మార్త పాల్గొన్నారు.

ఇసుక తోడుతున్న జేసీబీ సీజ్

వర్ధన్నపేట రూరల్, జనవరి 22 : మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని ఆకేరు వాగులో అక్రమంగా ఇసుకను తోడుతున్న జేసీబీని సీజన్ చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనంప్రకారం ల్యాబర్తి గ్రామంలోని ఆకేరు వాగు శివారులో ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వుతున్న సమాచారం మేరకు దాడులు చేయగా జేసీబీ పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు బొల్లం రాజేష్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు స్పష్టంచేశారు.

గ్రామానికి ఫ్రీజర్ అందచేత




సన్నూరులో ఫ్రీజర్‌ను అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాయపర్తి, జనవరి 22 : మండలంలోని సన్నూరులో సోమవారం లయన్స్ క్లబ్ సేవా తరుణి ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు వజినపల్లి శైలజా శ్రీనివాస్ దంపతుల సహకారంతో గ్రామానికి ఫ్రీజర్‌ను అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నలమాస సారయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ తమ్మెర లక్ష్మీనర్సింహా రావు, అడిషనల్ డ్రిస్టిక్ ట్రెజరర్ రేగూరి వెంకన్న, శారద, నాగవాణి, రమేష్, రజిత, శ్రీదేవి, మాధవ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వన నర్సరీల పెంపకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

• జడ్పీ సీఈవో రాంరెడ్డి



ఖాదర్‌పేటలో నర్సరీ పనులను పరిశీలిస్తున్న రాంరెడ్డి

చెన్నారావుపేట, జనవరి 22 : గ్రామాల్లో వన నర్సరీల పెంపకం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఖాదర్‌పేటలో చేపడుతున్న వన నర్సరీ పనులను ఆయన పరిశీలించి, మాట్లాడారు. ప్రతీ గ్రామంలో నర్సరీ పెంపకం కోసం మట్టిని బ్యాగుల్లో నింపాలని, వారం రోజుల్లో బ్యాగుల్లో విత్తనాలు విత్తే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎంపీవో శ్రీధర్‌రాజు, ఏపీవో అరుణ సర్పంచ్ అనుముల కుమారస్వామి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

చెన్నారావుపేట, జనవరి 22: విద్యుత్ సరఫరాలో ఈ నెల 23వ తేదిన అంతరాయంఉంటుందని ఏఈ జోగానంద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెక్కొండ మండలంలోని 132/33కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.